# కలుషిత నీటి కల్లోలం


నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 110 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
26-02-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


## బాధ్యత ఎవరిది?







- మరణాల్లో వాస్తవాలను దాస్తున్నారా?
- కలుషిత నీటితో మరణాలు... అధికారికంగా ఒక్కరేనా?
- ప్రోక్లైన్ పనులు, కాలువల పక్కన పైప్‌లైన్లే అసలు కారణమా?
- కమిషనర్ సస్పెన్షన్‌తో బాధ్యత ముగిసిపోయిందా?
- పర్యవేక్షించాల్సిన ఎంహెచ్‌ఓ ఏం చేస్తున్నారు?
- ఎంహెచ్‌ఓకు సస్పెన్షన్ లేదా?
- ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమా?
- కలుషిత నీరు తాగొద్దని కార్పొరేషన్ హెచ్చరికలే సాక్ష్యం
- ఆలస్యంగా తీసిన శాంపిల్స్‌పై అనుమానాలు

(నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం)



శ్రీకాకుళం పట్టణంలో కలుషిత నీటి కారణంగా వ్యాపించిన డయేరియా ఘటనపై అధికారుల వైఖరి తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. అధికారికంగా ఒక్క మరణమే జరిగిందని ప్రకటించినా, స్థానికంగా మూడు నుంచి నాలుగు మంది వరకు ప్రాణాలు కోల్పోయినట్టు బాధిత కుటుంబాలు, ప్రజాప్రతినిధులు చెబుతున్న నేపథ్యంలో అసలు నిజాలు దాచిపెడుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
రాజమహేంద్రవరం ఘటనలో పాలల్లో కల్తీ జరిగిందని ఐదుగురు మరణించినట్టు ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించగా, ఇక్కడ మాత్రం కలుషిత నీటి కారణంగా మరణాల సంఖ్యను తగ్గించి చూపడం వెనుక కారణాలు ఏమిటన్న కోణంలో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడికి వాస్తవాలు తెలియకుండా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమైనా వ్యూహాలు రచిస్తున్నారా అన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రైవేటు వ్యాపారాల విషయంలో కఠినంగా వ్యవహరించే ప్రభుత్వం, తాగునీటి సరఫరాలో జరిగిన లోపాల పట్ల మాత్రం మౌనం వహించడం విమర్శలకు దారితీస్తోంది.
ఈ ఘటనకు ప్రధాన కారణంగా కాలువల పక్కన ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు, ఇటీవల ప్రోక్లైన్ యంత్రాలతో చేపట్టిన పనుల వల్ల నీటి పైప్‌లైన్లు దెబ్బతిని మురుగు నీరు కలిసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మానవ వనరులను వినియోగించకుండా యంత్రాలతో నిర్లక్ష్యంగా తవ్వకాల పనులు చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ఇలాంటి పరిస్థితుల్లో కేవలం పది రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయడం ద్వారా బాధ్యత ముగిసిపోయిందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పైప్‌లైన్ వ్యవహారం ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్నదని, దీనిని సాకుగా చూపి కమిషనర్‌పై చర్యలు తీసుకోవడం సరైన విధానం కాదని కొందరు కాంట్రాక్టర్లు, ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.
అదే సమయంలో కాలువల వద్ద పైప్‌లైన్ల పర్యవేక్షణ బాధ్యత ఉన్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్‌ఓ) పూర్తిగా నిర్లక్ష్యం చేసినప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యలు లేకపోవడం అధికార వ్యవస్థ వైఖరిపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఏళ్లుగా స్థానికంగా పనిచేస్తున్న అధికారులు పరిస్థితులను గమనించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఎందుకన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
తాగునీటి సరఫరా వ్యవస్థ పర్యవేక్షణలో ఉన్న అధికారులు, ప్రజారోగ్య విభాగం, పాలక వర్గం --- అందరికీ బాధ్యత ఉండగా ఒక్క అధికారిపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
ఇదిలా ఉండగా కార్పొరేషన్ విడుదల చేసిన కరపత్రంలో సరఫరా చేసిన నీటిని తాగొద్దని సూచించడం, జిల్లా కలెక్టర్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించడం ద్వారా నీటి కలుషితంపై అధికారులకు ముందే సమాచారం ఉన్నట్టు స్పష్టమవుతోంది. అయినప్పటికీ శాంపిల్స్ ఆలస్యంగా సేకరించడం, అప్పటికే ట్యాంకులను శుభ్రం చేయడం, కొత్త నీరు ఎక్కించడం, క్లోరినేషన్ చేపట్టడం వంటి చర్యలు నిజానిజాలపై అనుమానాలను మరింత పెంచుతున్నాయి.
ప్రజాప్రతినిధులు స్వయంగా బాధిత కుటుంబాలను పరామర్శించిన సమయంలో బయటపడిన వ్యాధి లక్షణాలు, మరణాల సంఖ్యపై అధికారిక ప్రకటనలతో విభేదిస్తున్నాయని సమాచారం. అయినప్పటికీ బాధిత కుటుంబాలకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడం, మరణాలపై పూర్తి వివరాలు వెల్లడించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.
ఈ ఘటనలో ఎవరైనా కావాలని నీటిని కలుషితం చేశారనే అంశం కంటే, తాగునీటి పైప్‌లైన్ల ప్రణాళికలో నిర్లక్ష్యం, కాలువల వెంట లైన్లు ఏర్పాటు చేయడం, నిర్వహణలో లోపాలే అసలు కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
ఇప్పటికైనా కాలువల గుండా వెళ్లే పైప్‌లైన్లను మార్చి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంలో వాస్తవాలు దాచిపెట్టకుండా ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ రోజు రోజుకీ పెరుగుతోంది.
ఇదిలా ఉండగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో మాజీ మంత్రులు సీదిరి అప్పలరావు, కృష్ణదాస్‌లతో కలిసి పర్యటించి బాధితులను పరామర్శించారు. బాధితులు అనేక విషయాలను తెలియజేశారని సమాచారం. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ ప్రజారోగ్యాన్ని కనీసం పట్టించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## డయేరియా మరణాలపై ప్రభుత్వంపై ధర్మాన ఫైర్

- శ్రీకాకుళంలో డయేరియా బాధితులను పరామర్శించిన ధర్మాన
- కలుషిత నీటి మరణాలను దాచొద్దని ప్రభుత్వంపై విమర్శ.
- ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపణ.
- డయేరియా మరణాలు ప్రభుత్వ హత్యలేనని సీదిరి అప్పలరాజు వ్యాఖ్య.
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలఎక్స్‌గ్రేషియా డిమాండ్




2లో

ఎడిటోరియల్

# గోబెల్స్ స్టోరీ!

హిట్లర్ కాలంలో జర్మనీలో నాజీ పాలన ప్రచారం కోసం గోబెల్స్ సినిమాను అత్యంత ప్రభావవంతంగా ఉపయోగించాడు. హిట్లర్‌ను దేవుడిగా కీర్తిస్తూ 1935లో వచ్చిన 'ట్రయంఫ్ ఆఫ్ ది విల్' అత్యంత ముఖ్యమైన నాజీ ప్రచార చిత్రాలలో ఒకటి. 1938లో 'ఒలింపియా' చిత్రం ఆర్యన్ జాతి అథ్లెటిక్ పరాక్రమాన్ని ప్రపంచానికి చాటితే, మిలియన్ల మంది యూదుల మారణహోమాన్ని శాస్త్రీయంగా సమర్థించడానికి 'ది ఎటర్నల్ జ్యూ' అనే డాక్యుమెంటరీ రూపొందించబడింది. ఐరోపా నుండి తుడిచిపెట్టుకుపోవాలని హిట్లర్ చేసిన ఉద్రేకపూరిత ప్రసంగం తర్వాత చప్పట్లతో ఈ డాక్యు మెంటరీ ముగుస్తుంది. అదేమాదిరిగా భారతదేశంలోనూ గోబెల్స్ తరహా సినిమాలు పునరావృతం అవుతున్నాయి. ఉన్నత కులాల హిందువులను కీర్తించే సినిమాలు, విదేశీ ముస్లిం పాలకులచే దేశం నాశనం చేయబడిందని చూపే సినిమాలు, ముస్లింలు ప్రేమ నటిస్తూ... హిందూ అమ్మాయిలను కిడ్నాప్ చేసి మతమార్పిడి చేస్తున్నారని నిరూపించడానికి ప్రయత్నించే 'ది కేరళ స్టోరీ' వంటి సినిమాలు దేశంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి.

1960 నాటి 'మా భూమి' వంటి సినిమాలు సామాజిక మార్పునకు ఎంతగానో దోహద పడ్డాయి. సినిమా అనేది ప్రజలను ఏకం చేయడానికి వారధిగా వుండాలి. కానీ, బిజెపి అధికారం లోకి వచ్చిన తర్వాత సినిమాను ప్రజల మధ్య విభజనలు సృష్టించే సాధనంగా మార్చారు. కేరళ ప్రజల్లోని సామరస్య తను నాశనం చేసే లక్ష్యంతో, ఉద్దేశపూర్వకంగా విడుదల చేసిన 'కేరళ స్టోరీ-2' చిత్రం రాష్ట్రంపై జరుగుతున్న మరో సాంస్కృతిక యుద్ధం. 2023లో వచ్చిన 'కేరళ స్టోరీ' చిత్రం ఆసాంతం...మతోన్మాద మూకలు కేరళ గురించి వ్యాప్తిచేస్తున్న కొండంత అబద్ధాల ఆధారంగా రూపొందిన కట్టు కథ. కేరళకు చెందిన ముప్పై రెండు వేల మంది మహిళలు ఇస్లాంలో చేరారనే నినాదంతో ఈ చిత్రం విడుదలైంది. దేశంలోని లౌకిక సమాజం దీనికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో.. ముప్పై రెండు వేల మంది కేవలం ముగ్గురిగా మారారు. ఈ అబద్ధాల పునాదిపై నిర్మించిన కట్టుకథకు గాను సుదీప్తో సేన్ 2025లో ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డును అందుకున్నారు. తాజాగా 'గోస్ బియాండ్' పేరుతో విడుదలైన 'కేరళ స్టోరీ 2' టీజర్... మొదటి భాగం కంటే ఎక్కువ ప్రమాదకరంగా, కేరళతో పాటు దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేదిగా వుంది.

లౌకిక విలువలను, సోదరభావాన్ని నిలబెట్టిన కేరళను చూసి భయపడుతోన్న ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తులు... కేరళను ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా చిత్రీకరించాలనే మతతత్వ ఎజెండాతో ఈ తరహా సినిమాలను ప్రజల్లోకి వదులుతున్నారు. 'మతం పేరుతో విద్వేషాన్ని పెంచుకుంటూ పోతే, అది మన ఇంటినే దహించివేస్తుంది' అంటారు ప్రముఖ రచయిత ఖుష్వంత్ సింగ్. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక భారతదేశం. ముఖ్యంగా కేరళ రాష్ట్రం... అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి వుండే సంస్కృతికి పెట్టింది పేరు. ఆ ప్రజలను నేరస్తులుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించే ఇలాంటి సినిమాను సెన్సార్ బోర్డు ఎలా అనుమతిస్తుంది? 'ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బీఫ్' అనే పదాన్ని, 'జానకి' అనే పేరును కూడా ఉపయోగించకుండా సినిమాలను నిరోధించారు. ఆ భాగాలను కత్తిరించిన తర్వాతనే ఆ చిత్రాలను ప్రదర్శనకు అనుమతించారు.

వేర్పాటువాదాన్ని ప్రేరేపించే విషపూరిత సృజన 'కేరళ స్టోరీ-2'కు క్లీన్ యుఎ సర్టిఫికెట్ ఇవ్వడం శోచనీయం. 'సమాజంలో విభజన, విద్వేషాన్ని వ్యాప్తిచేసే లక్ష్యంతో నిర్మించిన విషపూరిత చిత్రం ఎలా అనుమతించబడుతుందో ఆశ్చర్యంగా ఉంది' అని కేరళ ముఖ్యమంత్రి సైతం ఘాటుగా స్పందించారు. కేరళ నిజమైన చరిత్ర వర్గపోరాటం, త్యాగాలు, సామాజిక సంస్కరణలతో కూడుకున్నది. సామాజిక సూచికలలో కేరళ సాధించిన పురోగతి, నిరుపేదలను విముక్తి చేసే ప్రయత్నం, కొండచరియలు విరిగిపడే భూమిలో అద్భుతంగా మనుగడ సాగించడం నిజమైన కేరళ కథ. వాస్తవాలను మసకబార్చే కట్టుకథలతో సినిమాలు తీస్తూ, విద్వేషాన్ని ప్రచారం చేయడం దేశ భవిష్యత్‌కు మంచిది కాదు. విచక్షణను వినియోగించవలసిన సెన్సార్ బోర్డు పెద్దలు పరివార్ కళ్లజోళ్లు తొలగించి వాస్తవాలను పరికించాలి. కేంద్ర పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గడం తగదు. ప్రజలు ఇటువంటి విద్వేష రాజకీయ చిత్రాల పట్ల అప్రమత్తంగా వుండాలి.

# జేసీస్ సేవలు యువతకు ఆదర్శం

## - డిఎస్పీ సి.హెచ్ వివేకానంద
## - అధ్యక్షులుగా జెసి లావేటి.లక్ష్మణరావు బాధ్యతలు




(నవతరం -శ్రీకాకుళం)

జేసీస్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు నిరూపమానమని, ముఖ్యంగా యువతకు ఆదర్శమని, శ్రీకాకుళం డిఎస్పీ సి.హెచ్ వివేకానంద అన్నారు. స్థానిక రామలక్ష్మణ కూడలిలోగల ఒక ప్రైవేట్ హాల్ లో, జేసీఐ శ్రీకాకుళం మధురం చాప్టర్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీసీ ఇంటర్నేషనల్ సంస్థను, శ్రీకాకుళం జిల్లాకు పరిచయం చేసి, తొలి అధ్యక్షుడిగా జామి భీమశంకర్ ఎన్నో సేవలందించారని, అదే స్ఫూర్తి నగరంలో ఇప్పటికీ కొనసాగడం అభినందనీయమన్నారు. జేసీస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఎల్వో మెంటార్ పాలిశెట్టి.మధుబాబు, జోన్ వైస్ ప్రెసిడెంట్ ఈశ్వరరావు వివరించారు. అనంతరం మరో ముఖ్య అతిథి జోన్4 ప్రెసిడెంట్ వసంతవాడ.చైతన్య నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. జేసీఐ శ్రీకాకుళం మధురం బ్రాంచ్ అధ్యక్షులుగా జెసి లావేటి.లక్ష్మణరావు, కార్యదర్శి సిహెచ్.మహేష్, కోశాధికారి టి.మనోహర్ తోపాటు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యవర్గ ప్రతినిధులు వివిధ విభాగాల తరపున చేపట్టాల్సిన పోస్టర్లను ఆవిష్కరించగా, నూతన అధ్యక్షులు జెసి లావేటి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై, యువతకు అవగాహన కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని, జేసీఐ శ్రీకాకుళం మధురంతో సేవా కార్యక్రమాలతో పాటుగా, యువతకు దిశానిర్ధేశం చేసే కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మధురం సభ్యులు, విశిష్ట అతిథి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల.మోహన్, ప్రత్యేక ఆహ్వానితులు జోన్ కోఆర్డినేటర్4 బిజినెస్ దూసి.సంతోష్, వివిధ రంగాల ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు, జెసిఐ శ్రీకాకుళం మెయిన్, జెసిఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ ప్రతినిధుల బృందం, వైద్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# డయేరియా మరణాలపై ప్రభుత్వంపై ధర్మాన ఫైర్







నవతరం శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కలుషిత నీటితో మరణించిన కుటుంబాలను కలిసి ఓదార్చిన ఆయన తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

కలుషిత నీరు తాగి మరణించిన వారిని వేరే రోగాలతో మృతి చెందినట్లు చూపించడం అత్యంత దుర్మార్గమని ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని, సీఎం నుంచి మంత్రుల వరకు ఎవరూ బాధ్యత తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న హెల్త్ అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

"మంచి ప్రభుత్వం" అంటూ ఇళ్లకు స్టిక్కర్లు అంటించడం వల్ల ప్రజల ప్రాణాలు కాపాడలేమని, ప్రజారోగ్యంపై నిజమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత డిసెంబర్‌లో బలగ ప్రాంతంలో డయేరియా కేసులు నమోదయ్యాయని, ఇప్పుడు నగరంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించిందని, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మందులు లేవని చెబుతున్నారని, అనేక మంది రోగులు ఇప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మున్సిపల్ వ్యవస్థ ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, నిధుల దుర్వినియోగంపై అనుమానాలు ఉన్నాయని ధర్మాన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, వైఎస్సార్సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. డయేరియాతో నలుగురు చనిపోతే కూటమి ప్రజాప్రతినిధులు కబడ్డీ ఆడుకుంటున్నట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని, ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు.

రాష్ట్రంలో ప్రజా వైద్య ఆరోగ్యశాఖ ఉందా లేదా అన్న అనుమానం కలుగుతోందని, కేవలం డయేరియా కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మరణించడం దారుణమన్నారు. త్రాగునీరు, పాలు, మద్యం తాగి ప్రజలు అకాల మృత్యువాత పడుతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఇంటింటికి ఇంటర్నెట్ అందిస్తామని చెప్పే ప్రభుత్వం ముందుగా ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరు అందించాలన్నారు.

డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు తక్షణమే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వ వైఖరిని వెంటనే మార్చాలని ఆయన హెచ్చరించారు.

ఈ పర్యటనలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, అందవరపు సూరిబాబు, శ్రీనివాస్ పట్నాయక్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూమి ఆక్రమణపై గునబద్ర గ్రామంలో ఆందోళన

- భీమలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన 2.5 సెంట్ల భూమి ఆక్రమణ ఆరోపణ.
- పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్థలం ఖాళీ కాలేదని గ్రామస్తుల వాదన.
- అధికారులు 7A, 6A నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.
- నోటీసులను పట్టించుకోవడం లేదని ఆక్రోశం.
- న్యాయం కోసం జిల్లా కలెక్టర్‌కు పాదయాత్రగా వెళ్లనున్న గ్రామస్థులు.
- దేవాలయ భూమి రక్షణ కోసం గునబద్ర గ్రామస్తుల పోరాటం




నవతరం కొత్తూరు

కొత్తూరు మండలం గునబద్ర ఆర్.ఆర్. భీమవరం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భీమలింగేశ్వర స్వామివారికి కేటాయించిన 7.5 సెంట్ల భూమిలో 2.5 సెంట్లు ఆక్రమణకు గురయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దేవాలయానికి చెందిన ఆ భూమిని వ్యక్తిగత పేరుతో ఆక్రమించుకున్నారని పేర్కొంటూ గ్రామ ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు.

గ్రీవెన్స్ కార్యక్రమాల్లో దరఖాస్తులు సమర్పించగా సంబంధిత అధికారులు గ్రామానికి వచ్చి పరిశీలించినట్లు గ్రామస్తులు తెలిపారు. విచారణలో ఆ స్థలం దేవాలయానికి చెందిందని నిర్ధారించారని, ఆక్రమణదారులకు 7ఏ, 6ఏ నోటీసులు జారీ చేశారని చెప్పారు. అయితే నోటీసులు జారీ అయినప్పటికీ ఇప్పటివరకు భూమి ఖాళీ చేయలేదని, అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయ ఆస్తులు కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని, ఆలయ భూములపై ఎలాంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా దేవాలయ భూములను రక్షించడం అత్యవసరమని వారు అంటున్నారు.

ఈ నేపథ్యంలో గునబద్ర గ్రామం నుంచి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నట్లు గ్రామస్థులు ప్రకటించారు. దేవాలయ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని గుడికి, గ్రామానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

స్థానిక ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన ఈ అంశంపై అధికారులు తక్షణం స్పందించి స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 26న పొందూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

నవతరం-పొందూరు

ఆడపిల్ల సేవా సొసైటీ ఆధ్వర్యంలో, జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత కేన్సర్ పరీక్షలు, మెగా వైద్య శిబిరం నిర్వహిస్తారు. ఈ విషయాన్ని సేవా సొసైటీ అధ్యక్షురాలు ఎం.లావణ్య తెలిపారు.ఈ శిబిరంలో కేన్సర్, ఊపిరితిత్తులు, గుండె, ఎముకలు, జెనరల్,కంటి వైద్య నిపుణులు పాల్గొని సేవలందిస్తారు.

రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డులను తీసుకుని రావాలి.అవసరమైన వారికి ఎన్.టి.ఆర్ వైద్య సేవ,ఆయుష్మాన్ భారత్ పథకాల కింద శస్త్రచికిత్సలను అందించనున్నట్టు లావణ్య పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు సెల్ 9121038589ను సంప్రదించవచ్చు.

# ఓ మనిషీ తెలుసుకో...
# ఈ పచ్చినిజం తెలుసుకో..!

ఎవరికీ తలవంచకు...
ఎవరి ముందు తలదించకు
ఎవరినీ యాచించకు...
అత్యాశతో దేనినీ ఆశించకు...

ఆత్మ విశ్వాసమే
నీ ఆయుధమైతే...
నిర్మలమైన నిశ్చలమైన
నిష్కల్మషమైన ప్రశాంతత
నిండిన నీ మంచిమనసే నీకు
ఒక పూలవనం ఒక మూలధనం...

ఎర్రని ఎండలో కండలు కరిగించే
కొండలు పిండి చేసే కష్టజీవులకు
కడుపునిండా తిండి కరువాయె...
నీతిగా నిజాయితిగా నిలిచేవారికి
కాసులుపోసి కేసులు గెలవలేనివారికి
అడుగడుగునా పరాజయమే ఎదురాయె...

రక్తాన్ని చెమట చుక్కలుగా మార్చి
రేయింబవళ్లు రెక్కల్ ముక్కల్ చేసే
అన్నదాతలు అస్థిపంజరాలై ఆకలితో
అలమటిస్తూ ఆత్మహత్యలకు సిద్ధమాయె...

దౌర్జన్యాలతో దోపిడీలతో
నోరులేని అమాయకుల్ని
దోచుకుని లక్షల కోట్లధనాన్ని
స్విస్ బ్యాంకుల్లో దాచుకునే
అవినీతిపరుల చీకటిరాజ్యం
ఇంకెంతో కాలం సాగదని...

ఈ జీవితమే
ఒక వైకుంఠపాళియని...
నింగికెగదోసే నిచ్చెనలే కాదు...
పాతాళానికి
పడదోసే పాములుంటాయని...

చిరునవ్వుల
చిరుదీపం వెలిగించి
చీకటి విషవలయాలను...
చీల్చుకుంటూ సాహసంతో
ముందుకు సాగిపోవాలని...

మంచితనానికి మానవత్వానికి
మించిన పెన్నిధి...వేరేదేమీలేదని....
ఓ మనిషీ తెలుసుకో...ఈ పచ్చినిజం
తెలుసుకో.



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# కలబందతో ఆరోగ్య లాభాలు



- రోజూ కలబంద జ్యూస్ తాగితే జీర్ణక్రియ మెరుగై శరీరం డీటాక్స్ అవుతుందని నిపుణుల సూచన
- బరువు నియంత్రణ, రక్తహీనత తగ్గింపు, చర్మం
- జుట్టు ఆరోగ్యానికి కలబంద ఉపయోగకరం

కలబందతో ఎన్నో అద్భుత ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఈరోజు ప్రసారం అయ్యే ఆరోగ్యమేమహాభాగ్యంలో తెలుసుకుందాం. కలబందతో అందం మాత్రమే కాదు... ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ముఖ్యంగా కలబంద జ్యూస్‌ను ప్రతిరోజూ తాగితే అనేక ప్రయోజనాలు ఉంటాయి. తలనొప్పి సమస్యతో బాధపడేవారికి ఇది ఉపశమనాన్ని ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే పరగడుపున కలబంద రసం తాగడం వల్ల తలనొప్పి తగ్గే అవకాశం ఉంది. శరీరంలో పేరుకుపోయే టాక్సిన్ల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు, చర్మ సమస్యలు వస్తాయి. కలబంద జ్యూస్ శరీరాన్ని డీటాక్స్ చేయడంలో సహాయపడుతుంది. రోజూ ఉదయం తాగితే శరీరంలోని మలినాలు బయటకు వెళ్లేలా చేస్తుంది. అలోవెరా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కేలరీలు, ఫ్యాట్ తగ్గించడంలో తోడ్పడుతుంది. ఒక గ్లాసు అలోవెరా జ్యూస్‌లో ఒక టీ స్పూన్ తేనె, ఒక టీ స్పూన్ నిమ్మరసం కలిపి వ్యాయామానికి ముందు లేదా తర్వాత తాగితే ఎనర్జీ లెవెల్స్ పెరుగుతాయి. మెటబాలిజం మెరుగై అధిక బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. వేసవిలో ఆకలి తగ్గిపోవడం, కడుపు సమస్యలు ఉండడం వంటి ఇబ్బందులు ఉన్నవారికి కలబంద జ్యూస్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను శుభ్రపరచి ఆకలి పెరగడంలో సహాయపడుతుంది.

శరీరంలో ఎర్ర రక్త కణాలు తగ్గి రక్తహీనత సమస్య ఉన్నవారికి కూడా కలబంద ఉపయుక్తమని చెబుతున్నారు. ఉదయాన్నే రసం తాగడం వల్ల రక్తహీనత తగ్గి అలసట కూడా తగ్గుతుంది. అంతేకాదు, కలబందను ముఖానికి, జుట్టుకు రాసుకుంటే చర్మం కాంతివంతంగా మారడమే కాకుండా జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ

**నవతరం -శ్రీకాకుళం**

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ భరోసా కల్పించారు. డయేరియా ప్రబలిన దమ్మలవీధి, కంద్రవీధిలోని బాధిత కుటుంబాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన మండల సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు తమ సమస్యలను మంత్రికి వివరించారు. డయేరియాతో బాధపడుతున్న దమ్మలవీధి - గోల్కొండ వీది చెందిన కెల్లి రమణమ్మ ను పరామర్శించి వాంతులు విరేచనాలు అవుతున్నాయా లేదని అడుగగా తగ్గినట్లు రమణమ్మ చెప్పారు. ఆరోగ్యం బాగుందా లేదని మంత్రి అడుగగా ప్రస్తుతం బాగానే ఉన్నట్లు రమణమ్మ మంత్రికి వివరించారు. వేడి చేసిన నీటిని మాత్రమే త్రాగాలని మంత్రి సూచించారు. ఎలాంటి బయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, అధైర్యం పడకుండా ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పరామర్శలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# మీనాక్షి ఆ బ్యానర్‌లో.. మళ్లీ

హీరోలను రిపీట్ చేస్తారు.. డైరెక్టర్లను రిపీట్ చేస్తారు. ఎందుకంటే బాక్సాఫీస్ క్రేజ్ ఉంటుంది కనుక. కానీ హీరోయిన్‌ను కూడా రిపీట్.. రిపీట్ అంటున్నారు సితార బ్యానర్ వాళ్లు. ఎందుకంటే మీనాక్షి ఉంటే హిట్ గ్యారంటీ అనే పేరు వచ్చేసింది ఇండస్ట్రీలో. అలా లక్కీ చార్మ్ అని పేరు పడిన మీనాక్షి చౌదరికి ముచ్చటగా మరో ఛాన్స్ వస్తోంది ఆ సంస్థలో.

గతంలో లక్కీ భాస్కర్, అనగనగా, గుంటూరు కారం ఇలా మూడు సినిమాలు చేశారు మీనాక్షి ఆ బ్యానర్‌లో. నాలుగో సినిమా నానితో ఉంటుందేమో అన్న వార్తలు కూడా వచ్చాయి.

మీనాక్షి చౌదరి ఒక తమిళ సినిమా, ఒక బాలీవుడ్ సినిమా ఓకే చేశారు. మరో బాలీవుడ్ సినిమా టాక్స్‌లో ఉంది. సౌత్ సినిమాలకు రెండు కోట్ల రెమ్యూనరేషన్ ఉంటే, బాలీవుడ్ సినిమాకు మూడు నుంచి నాలుగు కోట్లు ఉంటుంది. అది వేరే సంగతి.

ఇదిలా ఉంటే తనకు మూడు హిట్లు ఇచ్చిన సితార సంస్థలో మరో సినిమా టాక్స్‌లో ఉంది. అది హీరో కార్తీతో కావచ్చు. కార్తీ సినిమాకు భాగ్యశ్రీ బోర్సే పేరు వినిపిస్తోంది. మీనాక్షి పేరు కూడా ఛాయిస్‌లో ఉందని తెలుస్తోంది. సిద్దు జొన్నలగడ్డ పక్కన మీనాక్షికి ఆఫర్ వచ్చింది. కానీ కాల్‌షీట్ల సమస్య, పాత్ర సరిపోలేదా... మొత్తానికి అది చేయడం లేదు. నాని సినిమాకు త్రిప్తి పేరు దాదాపు ఫైనల్ అయింది.

అందువల్ల కార్తీతో అయినా, లేదంటే మరో ప్రాజెక్ట్‌తో సితారలో మీనాక్షి నాలుగో సినిమా చేసే అవకాశం ఉంది.

# జడల్ అంటే హడల్ అనేలా..!



పారడైజ్.. నాని చేస్తున్న భిన్నమైన పీరియాడిక్ సినిమా. గ్లింప్స్ తోనే ఆసక్తి రేపిన ఈ సినిమా చాన్నాళ్లుగా సెట్ మీదే వుంది. విడుదల కూడా ఇంకా దూరంగా వుంది. హీరో నానికి బర్త్ డే గిఫ్ట్ కింద పాటను విడుదల చేసారు. హీరో ఎలివేషన్ సాంగ్ లేదా అణిగిపోతున్న జనాలకు ఓ లీడర్ పుడితే వచ్చే పౌరుషాల సాంగ్ అనేలా మంచి సాహిత్యాన్ని కాసర్ల శ్యామ్ అందించారు. పాట పాటకూ రాటు తేలుతున్నారు కాసర్ల శ్యామ్. కేవలం తెలంగాణ మాండలీకం అని కాకుండా, అందులో లోతు, సన్నివేశాన్ని బట్టి కొత్త కొత్త అయిడియాలు చొప్పిస్తూ మంచి పాటలు రాస్తూ వస్తున్నారు.

పారడైజ్ సాంగ్ లో కూడా మంచి అవుటాఫ్ ది బాక్స్ అయిడియాలు వినిపించాయి. పచ్చబొట్టు గాయమిది గుంజుకునే న్యాయమిది అనే పద ప్రయోగం బాగుంది. అంటే హీరో చేతి మీద వున్న లం..కొడుకు అనే పచ్చబొట్టు వెనుక ఏదో కథ వుందని అర్థం అవుతోంది. బూడిదల గడ్డ ఇది, మాతో రాయబడ్డ కథ ఇది... ఇంకా ఇలాంటివి చాలా వినిపించాయి పాటలో.

సాహిత్యం తరువాత చెప్పుకోవాల్సింది నాని వేసిన హుక్ స్టెప్. బహుశా నాని కెరీర్ లోనే హుక్ స్టెప్ అన్నది ఇదే తొలిసారేమో? పిక్చరైజేషన్ గ్రాండ్ గా వుంది. సాహిత్యం తరువాత చెప్పాల్సింది అనిరుధ్ సంగీతం. సాధారణంగా అనిరుధ్ సంగీతం అంటే ట్యూన్ దగ్గర దొరికేస్తాడు. విన్న ట్యూన్ అనిపించేస్తాడు. కానీ ఈ పాట, ఫోర్స్ అంతా కొత్తగా వుంది. మొత్తం మీద పారడైజ్ అంచనాలు పెంచిందీ సాంగ్.

# దేశ ప్రతిష్టను దిగజార్చేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించింది

- బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. పైడి సింధూర
- దేశ ప్రతిష్టను దిగజార్చేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. పైడి సింధూర విమర్శించారు



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఏడురోడ్ల కూడలిలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు బృందంతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.. న్యూఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో కాంగ్రెస్ యూత్ వింగ్ సభ్యులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ దేశ గౌరవాన్ని దెబ్బతీశారని ఆమె అన్నారు. విదేశీ ప్రతినిధుల సమక్షంలో ప్రధాని మోడీపై విమర్శలు చేయడం దౌర్భాగ్యకరమని పేర్కొన్నారు.
జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మినీ జెట్టి కోసం మంచినీళ్ళపేట మత్స్యకారుల వినతి

- అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన ఎమ్మెల్యే గౌతు శిరీష.
- జెట్టి లేక ప్రాణ-ఆస్తి నష్టాలు ఎదురవుతున్నాయని మత్స్యకారుల వేదన.
- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ.
- అసెంబ్లీలో మంచినీళ్ళపేట మత్స్యకారుల గళం



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ళపేట గ్రామ మత్స్యకారుల మినీ జెట్టి డిమాండ్ శాసనసభ వేదికగా ప్రతిధ్వనించింది. పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో గ్రామ పెద్దలు, మత్స్యకారులతో కలిసి రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును అసెంబ్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు.
సుమారు ఐదు వేల జనాభా గల మంచినీళ్ళపేట గ్రామంలో 100 ఇంజిన్ బోట్లు, 100 కట్ల తెప్పలతో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నప్పటికీ ఫిషింగ్ జెట్టి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు వివరించారు. ముఖ్యంగా కెరటాలు, తుఫాన్ల సమయంలో బోట్లు, వలలు ధ్వంసమై ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
జెట్టి సౌకర్యం లేక జీవనోపాధి దెబ్బతింటోందని, ఉపాధి కోసం ప్రతి ఏడాది సుమారు 500 మంది గుజరాత్, గోవా, ముంబై, కర్ణాటక, మంగళూరు ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అక్కడ కూడా ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు తదితర గ్రామ పెద్దలు మంత్రికి సమస్యను వివరించగా, పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని, మినీ జెట్టి నిర్మాణానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మత్స్యకారుల సమస్యను అసెంబ్లీ స్థాయిలో ప్రస్తావించి, మంత్రిని నేరుగా కలిపిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార కుటుంబాలకు భద్రత, స్థిరమైన జీవనోపాధి కల్పించేలా మినీ జెట్టి మంజూరు వరకు తమ ప్రయత్నం కొనసాగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు.

# రైతు నిల్వ సామర్థ్యాల్లో చారిత్రాత్మక ముందడుగు..



- AIFతో రాష్ట్రంలో 1000కు పైగా ఆధునిక గోడౌన్లు
- రూ.504 కోట్ల భారీ పెట్టుబడి... గ్రామీణ వ్యవసాయ రంగానికి నూతన శకం
- PACSలను ఆధునిక మల్టీ పర్పస్ సౌకర్య కేంద్రాలుగా మారుస్తున్న ప్రభుత్వం
- తక్కువ వడ్డీ రుణాలు... పూర్తి ప్రభుత్వ హామీతో రైతు సంఘాలకు భరోసా
- డ్రైయింగ్ యార్డులు, ఆధునిక డ్రయర్లపై ప్రభుత్వ దృష్టి
- అకాల వర్షాలకు అడ్డుకట్ట... RSKల ద్వారా టార్పాలిన్ల పంపిణీ
- ఎలక్ట్రానిక్ డ్రయర్లపై పైలట్ ప్రాజెక్టులు...సాంకేతిక వ్యవసాయానికి శ్రీకారం
- శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**మందేసూర్యుడు న్యూస్, అమరావతి**

శాసన మండలిలో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (PACS)ను బహుళార్థ సాధక సౌకర్య కేంద్రాలు (MPFC)లుగా అభివృద్ధి చేసే కార్యక్రమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమగ్రంగా సమాధానం ఇచ్చారు. జూన్ 2020లో కేంద్ర ప్రభుత్వ Agriculture Infrastructure Fund (AIF) పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, రైతు భరోసా కేంద్రం (RSK) స్థాయిలో నిల్వ మరియు ఆరబెట్టే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. విశాఖపట్నం జిల్లా మినహా రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లు మరియు డ్రైయింగ్ యార్డుల నిర్మాణం జరుగుతోందని, మొత్తం రూ.504.42 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. నాబార్డ్ ద్వారా రీఫైనాన్స్ సదుపాయం కల్పించబడుతుందని, రుణాలకు 4% వడ్డీపై 3% వడ్డీ రాయితీ లభిస్తుందని, 90% రుణం మరియు 10% మార్జిన్ మనీ విధానంలో ప్రాజెక్టులు అమలవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్ మనీ కింద రూ.50.4 కోట్లు మంజూరు చేసి అందులో రూ.20 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని, 33 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.1 నామమాత్రపు అద్దెకు ప్రభుత్వ భూమి లీజుకు ఇస్తున్నట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు మరియు స్టాంపు డ్యూటీ మినహాయింపు కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద రుణాలకు ప్రభుత్వ హామీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1005 MPFC గోడౌన్ల పనులు ప్రారంభమై, 717 గోడౌన్లు మరియు అనుబంధ డ్రైయింగ్ యార్డులు పూర్తయ్యాయని, 572గ్రామాజూలో 1111 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ మీటర్లు, తూనిక బ్యాలెన్స్‌లు, డెస్క్‌టాప్‌లు సరఫరా చేసినట్లు తెలిపారు. 232గ్రామాజూలలోని 462 అసేయింగ్ కేంద్రాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు అందించామని చెప్పారు. మొత్తం రూ.381.72 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, అందులో గోడౌన్ల నిర్మాణానికి రూ.373.97 కోట్లు, పరికరాల సరఫరాకు రూ.7.75 కోట్లు ఖర్చయ్యాయని వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రైతులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు కల్పించి, పంటలకు మెరుగైన ధరలు సాధించే అవకాశాలు పెరుగుతున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు మండలికి తెలియజేశారు.

**రైతు ఆదాయం పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

అకాల వర్షాల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించిందని, 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో టార్పాలిన్లు పంపిణీ చేశామని, ఆ తరువాత పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు కొనుగోలు చేసి ప్రతి రైతు సేవా కేంద్రం (RSK)లో బల్క్‌గా నిల్వ ఉంచామని, ఇంతకుముందు వ్యక్తిగతంగా పంపిణీ చేసేవారమని, ఇప్పుడు అవసరమైన రైతులు RSK ద్వారా తీసుకుని అవసరం తీరిన తరువాత తిరిగి ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందిందని, ఆధునిక ఎలక్ట్రానిక్ డ్రయర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ అవి అధిక వ్యయంతో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో చర్చించి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఒకటి లేదా రెండు చోట్ల నమూనా ప్రాతిపదికన ఎలక్ట్రానిక్ డ్రయర్లు ఏర్పాటు చేసి, ఫలితాలు అనుకూలంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తడి ధాన్యాన్ని శాస్త్రీయంగా ఎండబెట్టి రైతులకు మెరుగైన ధర లభించేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక డ్రయింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# 260 మంది విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

**నవతరం -టెక్కలి**

టెక్కలి మండలం లో సీతాపురం,పోలవరం, లింగాలవలస, రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న 260 మంది విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ప్రతి విద్యార్థికి ప్లాంక్,పెన్, పెన్సిల్ పంపిణీ కార్యక్రమం చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. టెక్కలి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో సుమారు1500 మందికి స్టేషనరీ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.
మా అభయం యువజన సేవా సంఘం పై నమ్మకంతో ఈ కార్యక్రమానికి సహాయం అందించిన దాతలందరికీ అభయం యువజన సేవా సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు యన్ సింహాచలం, అద్దాల వీరభద్రాచారి, బమ్మిడి వెంకటరావు పాల్గొన్నారు.



# కమిషనర్ సస్పెన్షన్ రద్దు చేయాలి కాంట్రాక్టర్ల డిమాండ్

**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు సస్పెన్షన్‌ను రద్దు చేసి వెంటనే విధుల్లో పునర్నియమించాలని కాంట్రాక్టర్లు, సబ్కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వం వద్ద డిమాండ్ చేసింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరింది.
ఫిబ్రవరి 11న మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హనుమంతు కూర్మారావు విధులు చేపట్టిన తొలి రోజు నుంచే పట్టణ పరిశుభ్రత, తాగునీటి సరఫరా, పరిపాలనలో పారదర్శకతపై దృష్టి సారించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫిబ్రవరి 23న నగరంలో డయేరియా కేసులు నమోదు కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం తాగునీటి పైప్‌లైన్ లీక్ కావడం వల్ల కలుషిత నీరు సరఫరా కావడమే ఈ సమస్యకు కారణమై ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనలో పలువురు ఆసుపత్రిలో చేరడం, మరణాలు చోటుచేసుకోవడం బాధాకరమని తెలిపారు. అయితే బాధ్యతలు చేపట్టి 15 రోజులు కూడా పూర్తికాకముందే జరిగిన ఈ ఘటనకు కమిషనర్‌ను బాధ్యునిగా పేర్కొని సస్పెండ్ చేయడం అన్యాయమని అసోసియేషన్ పేర్కొంది. కొత్త అధికారిగా శాఖలోని వ్యవస్థ, కాంట్రాక్టులు, సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహనకు సమయం అవసరమని తెలిపింది.
ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి హనుమంతు కూర్మారావును వెంటనే విధుల్లో పునర్నియమించాలని కాంట్రాక్టర్లు, సబ్కాంట్రాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**